


గరిష్ఠం 33.0
కనిష్ఠం 23.2
***

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.20 (120.4136	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.66)	12.38	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	98.55 (0.65)	143	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.132 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

ఆయకట్టులో కరువు ఛాయలు

- వర్షాలు లేక సాగర్ ఆయకట్టులో ముందుపడని సాగు
- ఎండిన బోర్లు, బావులు
- ప్రత్యామ్నాయ పంటల ఊసే లేదు
- ఆందోళనలో రైతులు

వానాకాలంలో ఎక్కడ చూసినా జల వనరుల సవ్వడులు.. పంటల సాగు పనుల్లో క్షణం తీరిక లేని రైతులు.. పచ్చని పంటలతో నాగార్జునసాగర్ ఆయకట్టు శోభాయమానంగా కనువిందు చేస్తుంది. ఇది గతం.. కాలక్రమేణ వాతావరణంలో భారీ మార్పులు వచ్చాయి. వానాకాలం వచ్చినా ఇంకా వేసవి ఎండలు మండుతున్నాయి. జలమట్టం పడిపోయి బోర్లు, బావుల్లో నీటి జాడ కరువైంది. చుక్కనీటి కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నా ఫలితం కన్పించడం లేదు. ఇదీ నేటి సాగర్ ఆయకట్టు దుస్థితి.

● మిర్యాలగూడ (వ్యవసాయం)



చుక్కనీరు లేని మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్ చెరువు

లానినో ప్రభావంతో కరువు ఛాయలు తొలగుతాయని, ఈ ఏడాది జూన్ నుంచే లానినో కారణంగా నైరుతి రుతుపవనాల కదలిక చురుగ్గా ఉందని, దేశంలో సాధారణానికి మించి వర్షపాతం నమోదవుతుందని వానాకాలానికి ముందుకు వాతావరణశాఖ విడుదలచేసిన బులెటిన్ సారాంశం ఇది. గత ఏడాది మొత్తం పూర్తి కరువుతో అల్లాడిన రైతులు వాతావరణశాఖ తీపి కబురుతో ఊరట చెందారు. మళ్లీ మంచి రోజులు వస్తాయని ఆశపడ్డారు. మే నెల చివరి వారంలో చిన్న పాటి వర్షాలు కురవడంతో ఈ ఏడాది వానలకు కొదవ లేదనుకున్న రైతులు ప్రస్తుత కరువు పరిస్థితులకు తీవ్ర నైరాశ్యానికి గురవుతున్నారు. వానాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా, ఇప్పటి వరకు సరైన వర్షపాతం నమోదు కాలేదు. బోర్లు, బావులు, చెరువుల్లో నీటి ఊటే లేదు.

ఖాళీగా జలాశయాలు

సాగర్ ఆయకట్టులో ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభం కావల్సి ఉంది. వర్షాలు లేకపోవడంతో సాగర్ కాల్వలకు నీటి విడుదల లేదు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 312.50 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 120.41 టీఎంసీల నీరే ఉంది. సాధారణంగా ఏటా జూలై నుంచి ఆగస్టు వరకు ఏదో సమయంలో సాగర్‌కు వరద వస్తుంది. దీంతో పంట కాల్వలకు నీటి విడుదల జరిగేది. ప్రస్తుతం సాగర్ ఎగువ ప్రాంతాల్లో ఉన్న జలాశయాలు కనీస నీటి మట్టానికి పడిపోయాయి. కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టికి 84వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ఆల్మట్టి పూర్తిస్థాయి నిల్వసామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 81.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మరో 100 టీఎంసీలు వస్తేనే ఈ ప్రాజెక్టు నిండుతుంది. తుంగభద్ర నీటినిల్వ సామర్థ్యం 100.86 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 25.17 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. ఇక శ్రీశైలం జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 35.43 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వానాకాలం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో జలాశయాలకు వరద రావడం లేదు. భారీ వరదలు వస్తే తప్ప ఇప్పట్లో జలాశయాలు నిండే పరిస్థితి లేదు.

వానాకాలం సాగు జాప్యం

సాధారణంగా నార్లు పోసుకునేందుకు దీర్ఘకాలిక వరి పంటకు బోరు బావుల కింద మే నెల చివరి వారం నుంచి జూన్ 20 వరకు, మధ్యస్థ రకాలకు జూన్ 20 నుంచి జూలై 15వరకు, స్వల్పకాలిక రకాలకు జూలై వరకు, అత్యల్పకాలిక రకాలకు ఆగస్టు మొదటి వారం వరకు సరైన సమయం. సెప్టెంబరు మొదటి వారం వరకు నాట్లు పూర్తి చేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయి. జూన్‌లో వానాకాలం సీజన్ ప్రారంభమవుతుండగా, దశాబ్దాల కాలంగా సాగర్ జలాశయానికి ఆగస్టు నుంచి సెప్టెంబరు వరకు వరద వస్తుండటంతో నీటి విడుదల చాలా ఆలస్యంగా జరుగుతోంది. ఆయకట్టు రైతులు సెప్టెంబరులో నార్లు పోసుకుని అక్టోబరులో నాట్లు వేసుకుంటున్నారు. సీజన్ దాటి పోతుండటంతో పొట్ట కొచ్చే దశలో చలి వాతావరణం ఏర్పడుతుంది. పంటకు తెగుళ్ల బెడద అధికమై పంట దిగుబడులు సగానికి పడిపోతున్నాయి. పెట్టుబడులు భారీగా పెరిగి రైతులు నష్టపోవడం సర్వ సాధారణంగా మారింది.

బోరు బావుల కింద

ఆయకట్టులో మొత్తం 6.50లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగవుతాయి. సాగర్ ఆయకట్టుకు తరచూ నీటి విడుదల లేకపోవడంతో చాలా మంది రైతులు ప్రత్యామ్నాయంగా బోరు బావులు ఏర్పాటు చేసుకున్నారు. గత యాసంగిలో సుమారు లక్షలన్నర ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, నీటి లభ్యత లేక 30శాతం మేర పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారు. ప్రస్తుతం చాలా మంది రైతులు బోరు బావుల కింద వరి నార్లు సిద్ధ చేసుకున్నారు. నాట్లు వేయడానికి దుక్కులు సిద్ధం చేసుకున్నారు. సరైన వర్షాలు లేక బావుల్లో చుక్క నీరు రాలేదు. బోర్లు ఎండిపోయాయి. వరి నారు పోసిన దగ్గర నుంచి 25రోజుల్లో నాట్లు వేస్తేనే మంచి దిగుబడులు వస్తాయి. నీటి లభ్యత లేకపోవడంతో దుక్కులు తడవక నాట్లు వేయలేని పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టులో ఎన్నడూ లేని విధంగా రైతులు విపరీతంగా బోర్లు వేయిస్తు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈసారి కాలం కాదనే ఆలోచనతో బోర్లు వేయడానికి లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. భూగర్భ జలాలు పడిపోవడంతో నీటి లభ్యత కరువైంది. 10 బోర్లు వేస్తే ఒక్క బోరులో ఇంచు, ఇంచున్నర మించి నీరు రావడం లేదని రైతులు చెబుతున్నారు.

సాగు కష్టంగా మారింది



గత ఏడాది వర్షాలు లేక సాగర్ కాల్వలకు నీటి విడుదల లేదు. ఉన్న మూడు ఎకరాల వరి సాగుకు లక్షల రూపాయలు వెచ్చించి బోరు బావి ఏర్పాటు చేసుకున్నా. ఈ సారైనా వర్షాలు పడతాయనే ఆశతో పది రోజుల క్రితం వరి నారు పోశా. దుక్కులు దున్నా. బావి ఎండిపోగా బోరులో నీటి లభ్యత బాగా తగ్గింది. భారీగా వర్షాలు పడితే తప్ప వరి నాట్లు వేసే పరిస్థితి లేదు. మరో 15 రోజుల్లో నాట్లు వేయకపోతే నారు పనికిరాదు. ఇప్పటి వరకు విత్తనాలు సహా రూ.12 వేలకు వరకు ఖర్చు చేశా. వర్షాల కోసం ఎదురుచూస్తున్నాం.

చెవుల సైదులు, అల్వాలపాడు

ప్రత్యామ్నాయ ఆలోచన ఏదీ?

సాగర్ ఆయకట్టులో ఆరు దశాబ్దాలుగా వరి సాగవుతోంది. చాలా మంది రైతులకు వరి సాగు మినహా ఇతర ప్రత్యామ్నాయ పంటలపై కనీస అవగాహన లేదు. కాల్వకు నీటి విడుదల లేకున్నా, బోర్లు వేసుకుని వరి సాగు చేస్తున్నారే తప్ప ఆరుతడుల పంటల వైపు మొగ్గు చూపడం లేదు. ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీరు ఐదెకరాల ఆరుతడి పంటలకు సరిపోతుంది. కానీ, రైతులు ఆ దిశగా ఆలోచించడం లేదు. ప్రభుత్వాలు రైతులకు అవగాహన కల్పించేలా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి

● టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీఫారూక్

●7లో..

పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలి

● అదనపు డీజీపీ(ట్రైనింగ్) అభిలాష బిస్త్

●7లో..

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వాడుతున్న మెట్టపంటలు

- 20 రోజులుగా ముఖం చాటేసిన వరుణుడు

మోత్కూరు, జూలై 11: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 20రోజులుగా వరుణుడు ముఖం చాటేశాడు. రోహిణి, మృగశిక కార్తెల్లో కురిసిన వర్షాలకు పత్తి, కంది పంటలు విత్తారు. అవి మొలకెత్తడంతో రైతులు గుంటుక తోలి చేలల్లో కలుపులేకుండా చేశారు. ఆరుద్ర కార్తె గడిచి, పెద్ద పునర్వసు కార్తె సగం పాదం అవుతున్నా ఒక్క భారీ వర్షమైనా కురవకపోవడంతో పత్తి, కంది, పెసర తదితర మెట్టపంటలు వాడిపోతున్నాయి. అదను ప్రకారం వర్షాలు కురవకపోవడంతో చేలు ఎదగక దిగుబడి తగ్గే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురవాలని వరుణుడిని ప్రార్థిస్తూ గ్రామాల్లో చుట్టుకాముడు, కప్పకాముడు ఆడుతున్నారు.



వర్షాలు లేక మోత్కూరులో వాడిన పత్తి మొక్కలు

తగ్గిన పత్తి, కంది సాగు

యాదాద్రి జిల్లాలో వరుసగా మూడేళ్లుగా వర్షాలు అదను ప్రకారం కురవక పంటలు దెబ్బతింటుండటంతో నష్టపోతున్నామని భావిస్తున్న రైతులు ఏడాదిగా మెట్ట పంటల సాగు తగ్గించారు. జిల్లాలో మెట్ట పంటల సాగులో ప్రధానమైనవి పత్తి, కంది. 2022లో పత్తి 1,11,038 ఎకరాలు, కంది 8,661 ఎకరాలు సాగు కాగా, 2023లో పత్తి 1,02,777 ఎకరాలు, కంది 2,929 ఎకరాలు సాగైంది. ఈ ఏడాది 1,00,461 ఎకరాలు, కంది 1,249 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇలా ఏడాది క్రితం మెట్ట పంటల సాగు తగ్గుతోంది. వేసిన కొద్దిపాటి పంటలు కూడా వర్షాల్లేక ఎండలకు వాడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అదను ప్రకారం వర్షాలు కురవక

మే చివరి, జూన్ మొదటి వారంలో కురిసిన వర్షాలకు రైతులు పత్తి, కంది విత్తనాలు విత్తారు. విత్తనాలు మొలకెత్తాక చిరు జల్లులే తప్ప భారీ వర్షాలు కురవడంలేదు. రైతులు పత్తి, కంది చేలల్లో గుంటుకలు తోలి, కలుపు తీయించి శుభ్రం చేసి, వర్షాలకోసం ఎదురు చూస్తున్నారు. సుమారు 20రోజులుగా వర్షాల్లేక మొక్కలు ఎండలకు వాడిపోతున్నాయి. ఇప్పుడు మొక్కలకు తగినంత నీరు అందితేనే మొక్కలు ఏపుగా ఎదుగుతాయి. ఇప్పుడు వర్షం కురిస్తే మొక్కలకు ఎరువులు వేస్తారు. వర్షాలు కురవక సకాలంలో ఎరువులు అందించనట్లయితే చేలు ఎదగక కుంటుపడతాయి. దీంతో పంటల దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు లేక బురద దుక్కులు కూడా సాగడంలేదు. రోహిణి కార్తెలో పోసిన నార్లు ముదిరిపోతున్నాయి. బావులు, బోర్లలోనూ నీటిమట్టాలు తగ్గి, అక్కడక్కడ వరినాట్లు కూడా ఎండుతున్నాయిని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆరుద్ర కార్తె పోతే (వర్షాలు కురవకపోతే) ఆరు కార్తెలు పోతాయని పెద్దలు చెబుతుంటారు. అదే జరుగుతుందా అని రైతులు మదనపడుతున్నారు.

వరుణుడి కరుణ కోసం పూజలు

జిల్లాలో వర్షాలు లేక పంటలు వాడిపోతుండటంతో వరుణుడు కరుణించి వర్షాలు కురిపించాలని వేడుకుంటూ గ్రామాల్లో మహిళలు చుట్టుకాముడు, కప్పకాముడు ఆడుతున్నారు. వరదపాశం సమర్పిస్తున్నారు. గురువారం మోత్కూరు మండలంలోని పనకబండ గ్రామంలో మహిళలు చుట్టుకాముడు ఆడారు.

అధిక జనాభా అనర్థాలపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 11: అధిక జనాభాతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్ నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధిక జనాభాతో పేదరికం, నిరక్షరాస్యత, వనరులలేమి ఏర్పడుతుందన్నారు. జనాభాను నియంత్రిస్తే నిరుద్యోగం, పేదరికం వంటివి ఉండవన్నారు. ప్రస్తుతం దేశంలో చాలావరకు ఒకరు, ఇద్దరు పిల్లలతోనే సరిపెట్టుకుంటున్నారని, అందరూ కుటుంబ నియంత్రణ పాటిస్తున్నప్పటికీ, దీన్ని మారుమూల ప్రాంతాలకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ నియంత్రణలో పలు అధునాతన పద్ధతులు వచ్చాయన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, డీఎల్‌వో హరికృష్ణ, డీఐవో పద్మ, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారి అరుంధతి, పీవోడీటీ గీతావాణి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్

తిప్పర్తి: వైద్య సేవలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను ఆరాతీశారు. ప్రతీ వైద్యుడు, సిబ్బంది నిత్యం విధులకు హాజరవుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. పీహెచ్‌సీ నుంచి జిల్లా కేంద్రానికి రిఫర్ చేసిన రోగులు, గర్భిణుల ఆరోగ్య వివరాలు తెలుసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రానికి వెళ్లిన రోగులకు ఫోన్ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని ఆరాతీశారు. ఆస్పత్రిఇకి వచ్చే ప్రతీ రోగి ఆరోగ్య వివరాలు, చిరునామాను రికార్డు చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను తనిఖీచేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా జరుగుతున్న పనులు పరిశీలించారు. విద్య, భోజనం, వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మాడ్గులపల్లి మండలానికి చెందిన కస్తూర్బా కళాశాలకు భవనం లేకపోవడంతో తిప్పర్తికి మార్చారని, కొంత ఇబ్బందిగా ఉందని విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంట డీఈవో భిక్షపతి, తహసీల్దార్ డి.స్వప్న, తదితరులు ఉన్నారు.

నల్లగొండ అభివృద్ధిని అడ్డుకున్న కేసీఆర్



శిలార్‌మియాగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- *వారం రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల పనుల ప్రారంభం*
- *మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి*

తిప్పర్తి, జూలై 11: నాపై కోపంతోనే నల్లగొండ అభివృద్ధిని మాజీ సీఎం కేసీఆర్ అడ్డుకున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని శిలార్‌మియాగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయం, అంగన్‌వాడీ కేంద్రంతోపాటు కమ్యూనిటీ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దాతలు ముందుకు వచ్చినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సిలార్‌మియాగూడెం గ్రామానికి ప్రత్యేకంగా సబ్‌స్టేషన్‌ను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రూ.2,200కోట్లతో గ్రీన్ చానెల్ ద్వారా ఎస్ఎల్‌బీసీకి నిధులు కేటాయించినట్లు తెలిపారు. వారం రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కూడా ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓ సోదరుడిలా కొడంగల్ తరహాలో నల్లగొండకు అత్యధిక నిధులు కేటాయిస్తురని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలుష్యాన్ని అరికట్టడంతో పాటు వర్షాలు అధికంగా కురిసేందుకు మొక్కలు దోహదపడతాయన్నారు. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో 66లక్షల మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. నాటిన ప్రతీ మొక్కను బతికించేలా చర్యలు తీసకుంటామన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. పదోతరగతిలో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణుడు కావడంతోపాటు 9.5పైగా గ్రేడ్ సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత కలెక్టర్, తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదివామని అన్నారు. నాడు వసతులు లేకున్నా చదువుకున్నామని, ప్రస్తుతం ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని, చక్కగా చదువుకోవాలని కోరారు. డిజిటల్ తరగతులకు సంబంధించిన అన్ని మౌలిక వసతులు కల్పించాలని డీఈవోను ఆదేశించారు. క్రికెట్ కిట్ కావాలని విద్యార్థులు అడగ్గా, రూ.25వేల నగదును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రవి, జిల్లా సంక్షేమ అధికారిని సక్కుబాయి, తహసీల్దార్ స్వప్న, ఎంపీడీవో ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యర్రమాద కవిత, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్‌తో తిప్పలు

● ఈ- కేవైసీ రాకపోవడంతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

నల్లగొండ, జూలై 11: సబ్ రిజిస్ట్రార్ల ఈ-కేవైసీలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లపై తీవ్ర ప్రభావం చూపింది. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 1,000కిపైగా ప్రతీ రోజు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కావాల్సి ఉంటుంది. అయితే సబ్ రిజిస్ట్రార్ ఈ-కేవైసీ పనిచేయకపోవడంతో గురువారం కనీసం 20డాక్యుమెంట్లు కూడా రిజిస్ట్రేషన్ కాలేదని సమాచారం. ఉదాహరణకు నల్లగొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతీరోజు సగటున 7 నుంచి 20 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కావాల్సి ఉండగా అతి కష్టం మీద గురువారం కేవలం ఒకే ఒక్క డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ అయ్యింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ-కేవైసీ సమస్య తలెత్తినట్లు తెలిసింది. ఎస్ఆర్‌ల ఈ-కేవైసీ నిలిచిపోవడంతో అధికారులు బయోమెట్రిక్ చేయలేకపోయారు. దీంతో రిజిస్ట్రేషన్లు జరగలేదు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇదే సమస్య తలెత్తింది. ఆస్తుల, క్రయ విక్రయదారులు, సాక్షులకు సంబంధించిన ఈ-కేవైసీలో మాత్రం ఎలాంటి సమస్యలు లేకున్నా సబ్ రిజిస్ట్రార్‌ల ఈ-కేవైసీలో మాత్రం సమస్యలు రావడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్, జూలై 11: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్ల శ్రీశైలం డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హెల్త్‌కార్డుపై ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స అందించాలన్నారు. కమ్యుటేషన్ పీరియడ్‌ను 15 ఏళ్ల నుంచి 12 ఏళ్లకు తగ్గించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఆర్‌లను విడుదల చేయాలని, పీఆర్సీని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు గాయం నారాయణరెడ్డి, నూనె రంగయ్య, కె.రామలింగం, ఆర్.అమృత రెడ్డి, కె.యుగంధర్‌రెడ్డి, ఎస్.ఆంజనేయులు, కె.నారాయణరెడ్డి, కె.యాదగిరి, ఎం.వెంకటరెడ్డి, ఎం.శంకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

వరుణా.. కరుణ చూపవా...





సంస్థాన్‌నారాయణపురం మండలం అల్లందేవిచెరువు గ్రామంలో కప్పల పెళ్లి చేసేందుకు ఊరేగింపుగా జలబిందలతో వస్తున్న గ్రామస్థులు, కట్టంగూరు మండలం సత్యనారాయణపురంలో బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

సంస్థాన్‌నారాయణపురం / కట్టంగూరు / వలిగొండ / జూలై 11: వరుణుడి కరుణకోసం ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు వేడుకుంటున్నారు. బొడ్రాయిలకు జలాభిషేకం చేస్తూ... కప్పలకు పెళ్లిళ్ల చేస్తున్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని అల్లందేవిచెరువు గ్రామంలో మహిళలు వరుణ దేవునికి పూజలు చేశారు. మహిళలు ఇళ్ల నుంచి బిందెలతో నీళ్లు తెచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. కప్పలకు పెళ్లి చేశారు. వర్షాలులేక పంటలు సాగు చేద్దామంటే భయమేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను తొలగించి వర్షాలు కురిపించాలని వరుణ దేవుడిని వేడుకున్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం కలిమెర గ్రామపంచాయతీపరిధిలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన మహిళలు గ్రామంలోని బొడ్రాయికి బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం చుట్టు కాముడు ఆడుతూ వర్షాలు పడి పంట చేతికి రావాలని దేవుళ్లను కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని కంచనపల్లి గ్రామంలో వరుణ దేవుడిని వేడుకుంటూ కూలీలు టిఫిన్ బాక్స్‌లను మధ్యలో పెట్టి బతుకమ్మ ఆట ఆడారు.

పలుచోట్ల కురిసిన వర్షం

సూర్యాపేట జిల్లాలోని పలుమండలాల్లో గురువారం వర్షం కురిసింది. అత్యధికంగా మేళ్లచెర్వులో 8.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా చివ్వెంలలో 0.3 మిల్లీ మీటర్ల వానపడింది. జిల్లాలో సరాసరి 1.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అదే విధంగా యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో గురువారం రాత్రి వర్షం కురిసింది.

బాలిక ఆత్మహత్య

మిర్యాలగూడ, జూలై 11 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో గురువారం బాలిక ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఓ వార్డుకు చెందిన బాలిక(13) పాఠశాలలో 9వ తరతగతి చదువుతోంది. బాలిక తల్లి ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. గురువారం బాలిక పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై బాలిక సాయంత్రం సమయంలో ఇంట్లో ఉరివేసుకుంది. కాగా ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నిందితుల కోసం పోలీసుల గాలింపు

మాడ్గులపల్లి, జూలై 11 : నల్లగొండ జిల్లా కుక్కడం గ్రామంలో యువతి కల్యాణి ఆత్మహత్యకు కారణమైన నిందితులు ఆరూరి శివ, కొమ్మనబోయిన మధు కోసం పోలీసులు గాలిస్తున్నారు. బంధువుల ఇళ్లలో ఆరా తీయడంతో పాటు ఫోన్ల సిగ్నల్ ఆధారంగా పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కల్యాణి మృతి చెంది మూడు రోజులు కావస్తున్నా నిందితులను పట్టుకోకపోవడంతో మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అయితే నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని త్వరలోనే పట్టుకుంటామని పోలీసువర్గాలు చెబుతున్నాయి.

మృతి చెందిన పాడి గేదెతో నిరసన

బొమ్మలరామారం, జూలై 11 : మృతి చెందిన పాడి గేదెతో యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామస్థులు పంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలోని కెమికల్ కంపెనీల నుంచి వెలువడే వ్యర్థరసాయనాలను కుంటలు, చెరువుల్లోకి వదలడం వల్ల కలుషిత నీరు తాగి జీవాలు, గేదెలు మృత్యువాత పడుతున్నాయని అని గ్రామస్థులు ఆరోపించారు. ఆ నీరు తాగడంతో పాడి గేదె మృతి చెందిందని గ్రామస్థులు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మృతి చెందిన పాడి గేదెతో నిరసన చేపట్టారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చెరువు నీటిని సేకరించి పరీక్షించేందుకు తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు. రసాయనిక కంపెనీలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

పనిచేసిన కంపెనీకే కన్నం

● ముఠాగా ఏర్పడిన ఎయిర్‌టెల్ మాజీ ఉద్యోగులు
● ఎయిర్‌టెల్ టవర్ ఆర్ఆర్‌యూలు చోరీ
● నలుగురు అరెస్టు, రిమాండ్, పరారీలో మరో ఇద్దరు
● నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 11: సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ముఠాగా ఏర్పడిన ఐదుగురు తాము పనిచేసిన కంపెనీకే కన్నం వేశారు.పనిలో భాగంగా సాధించిన అనుభవాన్ని ఉపయోగించి వెంటనే గుర్తించని వస్తువులను చోరీ చేస్తూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుంటున్నారు. ఇలా మొత్తం 25చోట్ల చోరీలకు పాల్పడ్డారు. ఈ ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,20,000 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఎయిర్‌టెల్‌లో పనిచేసి ఆ సంస్థకే కన్నం వేసిన ఉదంతాలను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.

మిర్యాలగూడ మండలం ధీరావత్‌తండాకు చెందిన ధీరావత్ నగేష్, ధీరావత్ మురళి, ధీరావత్ చిరంజీవి, పానుగోతు సుమన్, ధీరావత్ నవీన్ ముఠాగా ఏర్పడి ఎయిటెల్ టవర్లకు సంబంధించిన రేడియో రిమోట్ యూనిట్లను(ఆర్ఆర్‌యూ: సిగ్నల్ కోసం ఉపయోగించే యంత్రాలు) చోరీ చేస్తున్నారు. చోరీ చేసిన ఆర్ఆర్‌యూలను ముఠా సభ్యుడు ధీరావత్ నగేష్‌కు తెలిసిన హైదరాబాద్‌లోని నాంపల్లికి చెందిన మున్నా అనే వ్యక్తికి అతి తక్కువ ధరలకు విక్రయిస్తూ వచ్చిన నగదును ముఠాకు చెందిన ఐదుగురు సమానంగా పంచుకుంటున్నారు. గత కొంత కాలంగా ఆర్ఆర్‌యూల చోరీకి పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్న ఈ ముఠాను గురువారం ఉదయం నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామ శివారులో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి పర్యవేక్షణలో నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు, ఎస్ఐ ఎస్.అంతిరెడ్డి, సీసీఎస్ హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, నార్కట్‌పల్లి పీఎస్ హెచ్‌సీ మధు, పీసీలు గిరిబాబు, శ్రీనులతో కలిసి ముఠాకు చెందిన ధీరావత్ చిరంజీవి, ధీరావత్ మురళి, పానుగోతు సుమన్, ధీరావత్ నవీన్‌లను అరెస్టు చేసినట్లు ఎస్పీ లేఖలో పేర్కొన్నారు. ధీరావత్ నగేష్, ఆర్ఆర్‌యూల కొనుగోలు చేసిన హైదరాబాద్‌కు చెందిన మున్నా పరారీలో ఉన్నారన్నారు. వారి నుంచి రూ.1,20,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పలు ప్రాంతాల్లో చోరీలు

కొంతకాలంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు మహబూబ్‌నగర్, గుంటూరు జిల్లాల్లో ఈ ముఠా ఎయిర్‌టెల్ సెల్‌టవర్లకు 5జీ సిగ్నల్స్ కోసం బిగించిన ఆర్ఆర్‌యూలను చోరీ చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్, నార్కట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట, మాడ్గులపల్లి, భువనగిరి, వాడపల్లి, మిర్యాలగూడ, చింతపల్లి, తిరుమలగిరి(సాగర్), మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా దాచేపల్లిలో ఆర్ఆర్‌యూలను చోరీ చేశారన్నారు. మొత్తం 13 ప్రాంతాల్లో ఆర్ఆర్‌యూలను చోరీ చేసినట్లు ముఠా సభ్యులు అంగీకరించినట్లు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో 9 చోరీలు, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 2, మహబూబ్‌నగర్, గుంటూరు ప్రాంతాల్లో ఒకటి చొప్పున చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. వీటితో పాటు గతంలో డిండి, భువనగిరి టౌన్, భువనగిరి రూరల్, సూర్యాపేట టౌన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా రాయచోటి, అనంతపురం జిల్లా రాప్తాపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 12 కేసులలో అరెస్టు అయినట్లు వెల్లడించారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన డీఎస్పీ శివరాంరెడ్డి, నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, ఎస్ఐ అంతిరెడ్డి, సీసీఎస్ హెచ్‌సీ విష్ణువర్ధన్ గిరితో పాటు సిబ్బందిని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

సెల్‌ఫోన్ టవర్లలో పనిచేసిన అనుభవంతో చోరీలు

మిర్యాలగూడ మండలం ధీరావత్ తండాకు చెందిన ధీరావత్ నగేష్, ధీరావత్ చిరంజీవి, ధీరావత్ మురళి, పానుగోతు సుమన్, ధీరావత్ నవీన్‌లు గతంలో ఎయిర్‌టెల్ సెల్‌ఫోన్ టవర్ల వద్ద కలిసి పనిచేశారు. ఈ అనుభవంతో వీరంతా కలిసి ఒక ముఠాగా ఏర్పడి ఎయిర్‌టెల్ టవర్లలో బిగించే ఆర్ఆర్‌యూలను పథకం ప్రకారం దొంగిలిస్తున్నారని ఎస్పీ తెలిపారు. సులభంగా డబ్బులు సంపాదించడానికి వీరికి ఉన్న అనుభవాన్ని ఉపయోగించారు. టవర్ నుంచి ఆర్ఆర్‌యూను తొలగించడం ద్వారా వినియోగదారులకు ఎలాంటి సిగ్నల్స్ ప్రాబ్లమ్, ఇంటర్‌నెట్ ప్రాబ్లమ్ సైతం ఉండదని కేవలం 5జీ సిగ్నల్ బదులు 4జీ సిగ్నల్ వస్తుందని తెలిసి ఆర్ఆర్‌యూలను చోరీచేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. ఆర్ఆర్‌యూలను చోరీచేసిన విషయం కూడా తెలుసుకునేందుకు టవర్లను పరిశీలిస్తే తప్ప తెలుసుకునేందుకు చాలా సమయం పడుతుందనే పరిజ్ఞానంతో ఎవరికీ చిక్కకుండా సులభంగా తప్పించుకోవచ్చనే ఉద్దేశంతో రాత్రి పూట నిర్మానుష్య ప్రదేశాల్లో ఉన్న టవర్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

నల్లగొండ క్రైం / పెద్దఅడిశర్లపల్లి, జూలై 11 : హత్య కేసులో ఒకరికి జీవితఖైదుతో పాటు జరిమానా, మరో ఇద్దరికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు తీర్పునిచ్చారు. 2019లో గుడిపల్లి మండలం పొగాకవారిగూడెంకు చెందిన గన్నబోయిన బుచ్చయ్యకు అదే గ్రామానికి చెందిన పాలివాళ్ల గన్నబోయిన బుచ్చయ్య అతడి కుమారులు సైదులు, నాగరాజులతో ఘర్షణ జరిగింది. బుచ్చయ్యను మరోవర్గానికి చెందిన గన్నబోయిన బుచ్చయ్య అతడి కుమారులు సైదులు, నాగరాజులు కలిసి గొడ్డళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేయడంతో బుచ్చయ్యకు తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు బుచ్చయ్య కుమారుడు గన్నబోయిన ఆంజనేయులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి పరిశోధన చేసి నిందితులైన గన్నబోయిన బుచ్చయ్య అతడి కుమారులు సైదులు, నాగరాజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో కోర్టులో ట్రయల్ నడిచి జిల్లా మేజిస్ట్రేట్ ఎం.నాగరాజు నిందితుల్లో గన్నబోయిన బుచ్చయ్యకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.1500 జరిమానా, గన్నబోయిన సైదులుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా, గన్నబోయిన నాగరాజుకు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసు పరిశోధన చేసి చార్జిషీట్ వేసిన అప్పటిఅధికారులు జీ.వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పరశురాం, ప్రస్తుత సీఐ ధనుంజయ, ఎస్ఐ దోరెపల్లి నర్సింహులు, కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మేళ్లచెర్వు, జూలై 11 : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రంలో అక్రమంగా నిల్వచేసిన 50 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మేళ్లచెర్వుకు చెందిన శాగంరెడ్డి కోటిరెడ్డి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వచేశాడు. పక్కా సమాచారంతో గురువారం సిబ్బందితో కలిసి ఇంటిని తనిఖీచేయగా 50క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమైందని, కోటిరెడ్డిపై కేసు నమోదు చేసి బియ్యాన్ని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలి

● అదనపు డీజీపీ అభిలాష బిస్త్



బెటాలియన్‌లో మాట్లాడుతున్న అదనపు డీజీపీ అభిలాష బిస్త్, పక్కన ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 11 : ట్రైనీ కానిస్టేబుళ్ల క్రమశిక్షణతో శిక్షణ పూర్తి చేసుకుని విధి నిర్వహణలో పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలని అదనపు డీజీపీ అభిలాష బిస్త్ సూచించారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌ను ఆమె సందర్శించారు. భోజనం, వసతిగృహాలు, తరగతి గదులను ఆమె తనిఖీ చేశారు. శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లతో ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అభిలాష బిస్త్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం సాధించడం గొప్ప అనుభూతిని ఇస్తుందని, పోలీస్ శాఖలోకి రావడం అదృష్టంగా భావించాలన్నారు. ట్రైనర్లు చెప్పే అన్ని విషయాలను క్షుణ్ణంగా నేర్చుకుని భవిష్యత్‌లో ఉపయోగించుకునేలా అవగాహనతో ఉండాలన్నారు. అంతకుముందు కమాండెంట్ సత్యశ్రీనివాస్, ట్రైనీ కానిస్టేబుళ్ల అదనపు డీజీపీకి పూలబొకేను అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సత్యశ్రీనివాస్, అదనపు కమాండెట్లు వెంకటేశ్వర్లు, రవిచంద్రన్, ఆర్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీటీసీని సందర్శించిన అదనపు డీజీపీ

నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీటీసీలో కానిస్టేబుళ్ల శిక్షణ కేంద్రాన్ని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి అదనపు డీజీపీ అభిలాష బిస్త్ సందర్శించారు. శిక్షణ కేంద్రంలోని అభ్యర్థుల అవుట్ డోర్, ఇండోర్ తరగతుల నిర్వహణ, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, బ్యారెక్స్, భోజనశాల, విద్యుత్ సరఫరా, విశ్రాంతి గదులు, ఇతర మౌళిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న ట్రైనీ కానిసేబుళ్లతో సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీసీ వైస్‌ప్రిన్సిపాల్, డీఎస్పీ విఠల్‌రెడ్డి, చీఫ్ డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్, ఆర్ఐ హరిబాబు, ఎస్ఐలు క్రాంతికుమార్, బాబు, శ్రీనివాస్, భరత్, ఆర్ఎస్ఐ అఖిల్, ఇన్‌స్ట్రక్టర్లు, తదితరులు పాల్గొన్నారు

యాదాద్రి జిల్లాలో భారీ అగ్ని ప్రమాదాలు

● చౌటుప్పల్‌లో ఓజో పరిశ్రమలలో భారీ అగ్నిప్రమాదం
● రూ.33కోట్ల ఆస్తినష్టం



మంటలకు పూర్తిగా దెబ్బతిన్న పరిశ్రమలు

చౌటుప్పల్ రూరల్, జూలై 11: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లంబావి సమీపంలోని ఓజో అగ్రికేర్ ప్రైవేట్ లిమిటెడ్, ఓజో పెస్టిసైడ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమల్లో షార్ట్‌సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రూ.33 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లగా ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. పరిశ్రమలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సీఐ అశోక్‌రెడ్డి, పరిశ్రమల బాధ్యులు రవి, రఘు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లంబావి గ్రామపరిధిలో ఓజో అగ్రికేర్ ప్రైవేట్ లిమిటెడ్, ఓజో పెస్టిసైడ్ ప్రైవేట్ పేరుతో ఆయా యాజమాన్యాలు పరిశ్రమలను పక్కపక్కనే 2019లో ప్రారంభించాయి. పరిశ్రమల్లో ఆర్గానిక్ పెస్టిసైడ్, ఫెర్టిలైజర్స్ ఉత్పత్తి చేస్తున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో భారీగా ముడి సరుకు దిగుమతి చేసుకుని పెద్ద ఎత్తున ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్ ఉత్పత్తి చేసి గోదాంలలో భద్రపరిచారు. ఆయా పరిశ్రమల్లో 90మంది కార్మికులు పనిచేస్తుంటారు. ఇరు కంపెనీల్లోని కార్మికులు రాత్రి 11గంటల వరకు పనిచేసి ఇళ్లకు వెళ్తుంటారు. ప్రమాదానికి ముందు అగ్రికేర్ పరిశ్రమలో 25మంది కార్మికులు పనిచేస్తున్నారు. రాత్రి 11 గంటలకు పని పూర్తయిన అనంతరం కార్మికులు అందరూ వెళ్లిపోయారు. పరిశ్రమ సమీపంలోని గదుల్లో నివాసం ఉంటారు.

అర్ధరాత్రి సమయంలో ఘటన

అర్ధరాత్రి రెండుగంటల సమయంలో ఓజో అగ్రికేర్ పరిశ్రమ నుంచి మంటలు చెలరేగి, ఓజో పెస్టిసైడ్ పరిశ్రమకు వ్యాపించాయి. పెస్టిసైడ్స్‌కు మండే స్వభావం ఎక్కువ ఉండటంతో మంటలు పెద్దఎత్తున ఎగిసిపడ్డాయి. అగ్రికేర్ పరిశ్రమ నుంచి పెస్టిసైడ్ పరిశ్రమ వరకు మంటలు వ్యాపించాయి. ఆలస్యంగా గమనించిన కార్మికులు పరిశ్రమ యాజమాన్యానికి, పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్నపోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు సాధ్యపడలేదు. భువనగిరి, రామన్నపేట, హయత్‌నగర్ ప్రాంతాల నుంచి ఎనిమిది ఫైర్‌ఇంజన్లను రప్పించి ప్రయత్నించినా సాధ్యంకాలేదు. తెల్లవారుజాము వరకు కూడా మంటలు ఎగిసిపడ్డాయి. ఉదయం ఆరు గంటలకు మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ అప్పటికే పరిశ్రమ పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో ఆర్గానిక్ పెస్టిసైడ్, ఫెర్టిలైజర్స్, ముడి సరుకు, యంత్రాలు, గోదాంలో భద్రపరిచిన ఉత్పత్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రాథమిక అంచనా ప్రకారం దాదాపు రూ.33 కోట్ల నష్టం వాటిలినట్లు పరిశ్రమల యజమానులు రవి, రఘులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. షార్ట్‌సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగినట్టు యజమానులు తెలిపారు. పరిశ్రమల యజమానుల ఫిర్యాదుల కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

బీబీనగర్‌లోని సిమెంట్ ట్రేడర్స్‌లో..

బీబీనగర్, జూలై 11: యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ పట్టణంలోని శ్రీసాయితేజ సిమెంట్ ట్రేడర్స్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో రూ.2కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగింది. బీబీనగర్ పట్టణంలోని పోచంపల్లి రోడ్డులో ఉన్న శ్రీ సాయి తేజ సిమెంట్ ట్రేడర్స్ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి దాటాక సుమారు 12.30 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. దుకాణం నుంచి పొగలు చెలరేగటంతో పక్కనే ఉన్న పెయింట్స్ దుకాణం నిర్వాహకుడు సమీపంలో నివాసం ఉంటున్న ప్రజలను అప్రమత్తం చేశాడు. దుకాణ యజమాని పలుగుల శ్రీనివాస్‌కు, పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అరగంట తర్వాత ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు దుకాణానికి ఇరువైపుల ఇళ్లలో ఉన్న ప్రజలను అప్రమత్తం చేసి బయటికి పంపించారు. యజమాని సహాయంతో షాపు షటర్ తెరిచారు. క్షణాల్లోనే మంటలు పైఅంతస్తుకు వ్యాపించాయి. షాపులో పెయింట్ డబ్బాలు, ప్లైవుడ్ డోర్లు, ఎలక్ట్రికల్ పరికరాలు, తదితర మండే స్వభావం ఉన్న సామాగ్రి కారణంగా అగ్ని కీలలు వేగంగా భవనం మొత్తానికి వ్యాపించి విస్ఫోటనాన్ని తలపించేలా మంటలు ఎగిసిపడ్డాయి. అగ్నిమాపక వాహనాలు వచ్చే సరికి విలువైన పరికరాలు, సామాగ్రి పూర్తిగా కాలిపోయి బూడిదైంది. ఏడు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అగ్ని ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణం అయిఉండొచ్చని అగ్నిమాపక సిబ్బంది అభిప్రాయపడ్డారు. ప్రమాదంలో సుమారు రూ.2కోట్లకు పైగా ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని యజమాని శ్రీనివాస్ తెలిపారు. భారీగా ఆస్తి నష్టం జరగడంతో దుకాణ యజమాని శ్రీనివాస్‌తో పాటు కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.



అగ్నిప్రమాదంతో దెబ్బతిన్న శ్రీసాయితేజ సిమెంట్ ట్రేడర్స్ దుకాణం

నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

● టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీఫారూక్



నల్లగొండ పరిషత్ కార్యాలయంలో గృహజ్యోతి ఎడిట్ ఆప్షన్‌ను పరిశీలిస్తున్న ఎండీ అలీఫారూక్

నల్లగొండ టౌన్, జూలై 11 : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీఫారూక్ అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్ రోడ్డులోని విద్యుత్ విశ్రాంతి భవన్‌లోని ఉమ్మడి జిల్లా విద్యుత్ అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గృహజ్యోతి పథకం ద్వారా 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అమలు చేస్తున్నందున అధికారులంతా సమర్థంగా పనిచేసి పథకాన్ని విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో కొందరు వినియోగదారులు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ వారికి కొన్ని సాంకేతిక కారణాలతో పథకం అమలు కాలేదన్నారు. ఈలోగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎడిట్ ఆప్షన్ తీసుకరాలేకపోయామని, ప్రస్తుతం ఎడిట్ ఆప్షన్ అందుబాటులోకి వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యుత్ వినియోగదారుడు తమ మండల పరిషత్ కార్యాలయంలో, పట్టణ వినియోగదారులు మునిసిపల్ కార్యాలయంలో సంప్రదించి ఫోన్‌నెంబర్, ఆధార్‌నెంబర్, రేషన్‌కార్డు నెంబర్లను ఎడిట్ చేసుకొని తద్వారా పథకానికి అర్హత సాధించవచ్చన్నారు. ఈ విషయంపై అధికారులంతా వినియోగదారులలో అవగాహన కల్పించాలన్నారు. రైతాంగానికి మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలో నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్తగా సబ్‌స్టేషన్లను మంజూరు చేశామన్నారు. వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు రూ.10కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. లైన్ లాస్‌లో భాగంగా విద్యుత్ చౌర్యం కేసుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు సీఎండీ నల్లగొండ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి గృహజ్యోతి పథకంలో ఎడిట్ ఆప్షన్ సంబంధించి వినియోగదారుల నుంచి నమోదువుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బిక్షపతి, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల ఎస్ఈలు చంద్రమోహన్, పౌల్‌రాజ్, శ్రీనాథ్, నల్లగొండ డీఈ వెంకటేశ్వర్లు, ఇతర డీఈలు, ఏడీలు,ఏఈలు పాల్గొన్నారు.

రేషన్, గంజాయి అక్రమ రవాణా నిఘా పెట్టాలి



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 11 : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, రేషన్ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులు లేకుండా అవసరమైన అన్నిచర్యలు తీసుకుని త్వరగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేందుకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, పరిశోధన చేసే సమయంలో ప్రతీ కేసులో నాణ్యమైన పరిశోధనతో పూర్తి పారదర్శకంగా చేయాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకూ ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. ఫోక్సో, గ్రేవ్ కేసుల విచారణను పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. అవసరమైతే న్యాయమూర్తులను కలిసి కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో సమర్థంగా సేవలందించాలని, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ టీవీల ప్రాముఖ్యంపై అవగాహన పెంపొందించాలన్నారు. మహిళల భద్రతకు భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలందించాలని సూచించారు. సైబర్ క్రైమ్, డయల్-100 వినియోగంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి, జూదం, రేషన్‌బియ్యాన్ని తరలింపు నేరాలకు తరుచూ పాల్పడే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఎస్పీ రాములునాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, డీఎస్పీలు శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, గిరిబాబు, సైదా, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని కండీషన్‌లో ఉంచుకోవాలి

పోలీస్‌శాఖకు సంబంధించిన ప్రతీ వాహనాన్ని మంచి కండీషన్‌లో ఉంచుకోవాలని ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. గురువారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్‌వాహనాలను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనాల నిర్వహణ లోటుపాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. తనిఖీలు చేపట్టి సమగ్ర నివేదికలను నెలవారీగా సమకూర్చాలని ఎంటీవోను ఆదేశించారు. డ్రైవర్లకు వాహన నిర్వహణపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు.

పర్నీచర్, పాత ఇనుము వేలం రేపు

నల్లగొండ క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయంలో కూల్చివేయబడిన క్వార్టర్స్‌కి సంబంధించిన ఉడెన్ డోర్స్, విండోస్, ఇతర పర్నీచర్, పాత ఇనుము వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో వేలు ఉంటుందన్నారు. పాల్గొనేవారు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు వెల్ఫేర్ ఆర్ఐ ఫోన్ నెంబర్ 8712670171ను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలహీన పడింది: మోత్కుపల్లి



మోత్కుపల్లికి కేక్ తినిపిస్తున్న అభిమానులు

ఆలేరు రూరల్, భువనగిరి అర్బన్, జూలై 11: కాంగ్రెస్ పార్టీ బలహీనపడిందని, బలోపేతం చేసుకోవాల్సిన బాధ్యత పార్టీపైనే ఉందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట, ఆలేరులో ఆయన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంపోయిన కారణంగానే రాష్ట్రంలో ఎనిమిది ఎంపీ సీట్లను పోగొట్టుకోవాల్సి వచ్చిందన్నారు. రాహుల్‌ను ప్రధాని చేయాలని సోనియాగాంధీ కన్న కలలు రాష్ట్రంలో దూరమయ్యాయన్నారు. నిరుద్యోగులకు ఇస్తానన్న రూ.4వేల నిరుద్యోగ భృతి, ఇవ్వలేకపోవడం విచారకరమన్నారు. తులం బంగారం ఇస్తానన్న హామీ ఎటుపోయిందని ప్రశ్నించారు. మహిళలకు ప్రతీ నెలా రూ.2500 ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో పెళ్లిళ్లు చేసుకోలేకపోతున్నారన్నారు. గత ప్రభుత్వం కొంతమేరకు దళితబంధు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం అదికూడా చేయలేకపోయిందన్నారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నా గుంట భూమి లేదన్నారు. ఏ పార్టీ టికెట్ ఇవ్వకున్నా ఆలేరు ప్రజలు తనను పెద్ద మనసుతో ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ చూపిన దారిలో బతుకుతున్న తనకు అధునిక కాలంలో డబ్బులు లేని కారణంగా ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ రాలేదన్నారు. అధికారంలో ఉన్న సామాజిక వర్గమే బాగుపడుతుందని, మిగతా కులాలు ఆర్థికంగా, రాజకీయంగా వెనుబడిపోతున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫొటోను కూడా ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. ఏపీలో సీఎం చంద్రబాబునాయుడు హామీలను వెనువెంటనే నెరవేర్చుతున్నారని, అక్కడి పాలన విధానం చూసి నేర్చుకోవాలన్నారు.


భార్య కాపురానికి రావడంలేదని ఆత్మహత్య



రమేష్(ఫైల్)

దేవరకొండ, జూలై 11: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం కొండమల్లేపల్లి మండలం చింతచెట్టుతండా పంచాయతీ పరిధిలోని పూల్‌సింగ్‌తండాకు చెందిన నేనావత్ రమేష్(32)కు పదేళ్ల కిందట మిర్యాలగూడ మండలం మాటూరు తండాకు చెం దిన భారతితో వివాహమైంది. కుటుంబ సమస్యలతో భార్య కాపురానికి రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన రమేష్ గురువారం సాయంత్రం పొలం వద్ద క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన చుట్టుపక్కల వారు రమేష్‌ను పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రమేష్‌కు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నట్లు సమాచారం.

కారు అతివేగానికి ఒకరు మృతి



సత్యనారాయణ(ఫైల్)

తిరుమలగిరి, జూలై 11 : బైక్‌ను కారు అతివేగంగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ సత్యనారాయణ, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి పట్టణానికి చెందిన వ్యాపారులు గబ్బెట సత్యనారాయణ, ఇమ్మడి వెంకటేశ్వర్లు రైస్‌మిల్లులో పనిముగించుకుని సూర్యాపేట రోడ్డు నుంచి తిరుమలగిరి వస్తున్నారు. లక్ష్మీనగర్ టౌన్‌షిప్ సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఇరువురు బైక్ పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరిని ఆసుపత్రికి తరలించగా గబ్బెట సత్యనారాయణ(71) చికిత్స పొందుతూ మరణించాడు. మరో వ్యక్తి ఇమ్మడి వెంకటేశ్వర్లు చికిత్స పొందుతున్నాడు. సత్యనారాయణ కుమారుడు ఉమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మేళ్లచెర్వు, జూలై 11 : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలకేంద్రంలో లారీ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్షసాక్షులు కథనం ప్రకారం హేమ్లా తండాకు చెందిన భూక్యా బాలు బైక్‌పై తండా నుంచి మేళ్లచెర్వుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన బాలును బంధువులు, కోదాడ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేష్ తెలిపారు.

నలుగురు నిందితుల అరెస్ట్

మిర్యాలగూడ రూరల్, జూలై 11 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో వ్యక్తి మృతి కేసులో నలుగురు నిందితులను గురువారం మిర్యాలగూడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన ముల్కపల్లి సతీష్‌కు అదే గ్రామానికి చెందిన కుంచం విక్రమ్‌కు రెండు నెలల క్రితం గొడవ జరిగింది. ఈ విషయంలో రైస్‌మిల్లు డ్రైవర్‌గా పనిచేస్తున్న వస్కుల జనార్ధన్(34) అనే వ్యక్తి సంతోష్‌కు మద్దతుగా ఉన్నాడు. దీన్ని మనసులో పెట్టుకున్న విక్రమ్ ఈ నెల 7న రాత్రి గ్రామంలోని కిరాణ షాప్ వద్దకు వచ్చిన జనార్ధన్‌తో గొడవపడ్డాడు. గొడవ విషయం అతడి తల్లిదండ్రులైన కుంచం శ్రీనివాస్, ఎల్లమ్మలతో పాటు సోదరుడు అజిత్‌కు ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. దీంతో అక్కడికి చేరుకున్న విక్రమ్ కుటుంబసభ్యులంతా కలిసి జనార్ధన్‌ను తీవ్రంగా కొట్టి గాయపరిచారు. గాయాలైన జనార్ధన్‌ను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 9న మృతిచెందాడు. జనార్ధన్ సోదరుడు కొండల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన రూరల్ పోలీసులు దాడి ఘటనలో పాల్గొన్న కుంచం విక్రమ్, కుంచం పెద్ద శ్రీను, కుంచం ఎల్లమ్మ, కుంచం అజయ్‌లను అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ నరేష్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

మద్దిరాల, జూలై 11 : విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందింది. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం మామిళ్లమడవ గ్రామానికి చెందిన గాడిదల లింగయ్య పాడిగేదె పాలేరు వాగులో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.65 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు లింగయ్య కోరారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్

తిరుమలగిరి రూరల్, జూలై 11 : సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని వెలిశాలి ఎక్స్‌రోడ్డు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ గురువారం సాయంత్రం పేలింది. దీంతో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఆ సమయానికి చుట్టుప్రక్కన ప్రజలు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పేలిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ 20ఫీట్ల వరకు చిమ్మాయి. ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేయడంతో మంటలు ఆగిపోయాయి. పెనుప్రమాదం తప్పడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



వెలిశాల ఎక్స్‌రోడ్డు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పేలి ఎగిసిపడుతున్న మంటలు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, విద్యార్థులు

విద్యార్థులకు బకాయిలు విడుదల చేయాలి

నల్లగొండ టౌన్, జూలై 11 : తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో భాగంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులు స్థానిక బాలుర ఐటీఐ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం డీఆర్వో రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.8 వేల కోట్లు బకాయిలు ఉండటంతో ప్రైవేట్ కళాశాలలో చదువుకునే పేద, మధ్యతరగతి విద్యార్థులు పైచదువులకు వెళ్లాలంటే స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ రాలేదని విద్యార్థులకు ఇవ్వాల్సిన స్టడీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ప్రైవేట్ కళాశాలలు ఇబ్బంది గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ కుంచం కావ్య, జిల్లా ఆఫీస్ బేరర్స్ రమావత్ లక్ష్మణ్‌నాయక్, బూడిగ వెంకటేష్, కోరే రమేష్, సంపత్, యువరాజ్, రావణ్, జగదీష్, వీరన్న, ప్రసన్న, అజయ్, నరేష్, యశ్వంత్, నిశ్వంత్, సన్ని, కార్తీక్, శివ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతతో ప్రజారోగ్యం

● 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమం
● ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎల్ఆర్



పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభించి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, జూలై 11: పట్టణ పరిశుభ్రతతో ప్రజారోగ్యాన్ని పెంపొందిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంలో భాగంగా పట్టణంలో నాలుగు రోజల పాటు కొనసాగనున్న పారిశుధ్య, స్వచ్ఛంద పనులను గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణ పరిశుభ్రతతో పాటు కాలనీలను సుందరీకరించుకోవాలని ఆయన అన్నారు. మిర్యాలగూడను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యం గా భావించి మొదటగా పట్టణాన్ని మురుగు, చెత్త రహిత ప్రాంతంగా తీ ర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని 48 వార్డుల్లో రోజుకు 12 వా ర్డుల వారీగా 4 రోజులు మునిసిపల్ సిబ్బంది, అదనంగా వార్డుకు 10 మంది పారిశుధ్య కార్మికుల ఏర్పాటుతో పాటు కాంగ్రెస్ అభిమానులు, స్వ చ్ఛంద సంస్థలు డ్రైన్‌లను క్లీన్ చేయడం, పిచ్చి మొక్కలు తొలగించడం, మొక్కలు నాటడం లాంటి సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు పట్టణ పారిశుధ్య స్వచ్ఛంద కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. రెవెన్యూ, హెల్త్, పోలీస్ అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల సిబ్బంది సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భాగంగా రెడ్డి కాలనీలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే స్వయంగా పారిశుధ్య కార్మికులతో కలిసి డ్రైనేజీ క్లీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ రాజశేఖరరాజు, తహసీల్దార్ హరిబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, కౌన్సిలర్లు వంగాల నిరంజన్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, రామకృష్ణ, రవినాయక్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, డిప్యూటీ డీహెండ్‌హెచ్‌వో కేస రవి, ఎంఈవో బాలాజీనాయక్, బీఎల్ఆర్ బ్రదర్స్ అమృతారెడ్డి జానకిరాంరెడ్డి, జలందర్‌రెడ్డి, ఇంద్రకుమార్, నాగరాజు, అవుట శ్రీనివాస్, శ్రీనివాస్, శివ, జనయేత్రి ఫౌండేషన్ మునీర్, లయన్స్ క్లబ్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


కేజీబీవీ పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అడవిదేవులపల్లి, జూలై 11: రాష్ట్రంలో బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.2.70కోట్లతో నూతనంగా నిర్మించిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల బాలికలు చదువును మధ్యలో నిలిపివేయకుండా, బాల్య వివాహాలను నిరోధించడానికి కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రుల నమ్మకాలకు అనుగుణంగా బాలికలకు గుణాత్మకమైన విద్యను అందించి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. వన మహోత్సవం సందర్భంగా వారు పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో కరుణాకర్‌రావు, ఎంఈవో బాలాజీనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమావత్ బాలునాయక్, నాయకులు బండి నాగేశ్వర్‌రావు, బండి నరసింహారావు, గొడుగు హనుమయ్య, పెద్దింటి రామ్మూర్తి, హెచ్ఎం వరలక్ష్మి, పాఠశాల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోర్టు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలి

● ఎమ్మెల్సీ కోటిరెడ్డి


కోర్టు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నిడమనూరు, జూలై 11: నిడమనూరు మండల కేంద్రంలో రూ.5.25 కోట్ల నిధులతో నిర్మిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనం నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్సీ, నిడమనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంసీ కోటిరెడ్డి అన్నారు. గురువారం ఆర్డీవో శ్రీనివాసరావు, పలువురు న్యాయవాదులతో కలిసి కోర్టు భవనం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల ప్రగతి గురించి తెలుసుకుని, నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నిడమనూరులో మున్సిఫ్ కోర్టు భవనం నిర్మాణం అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. న్యాయవాదులు, కక్షిదారులకు కూడా ప్రయోజ నం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బొల్లం శ్రీనివాస్‌యాద వ్, చెన్ను సుందర్‌రెడ్డి, పెద్దబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఉన్నం సత్యనారాయణ, వెంకన్ననాయక్, నాగరాజు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు


గోదాంను పరిశీలిస్తున్న డీఎస్వో వెంకటేశ్వర్‌రావు

మిర్యాలగూడ, జూలై 11: ప్రజా పంపిణీ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం పీడీఎస్ బియ్యం సరఫరా చేసే ఎంఎల్ఎస్ పాయింట్‌ను, పలు రేషన్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాప్ నెం. 17లో బియ్యం నిల్వలో 10 క్వింటాళ్లు తక్కువగా ఉండటంతో డీలర్ నిర్మల పై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా కార్డుదారులు బియ్యాన్ని డీలర్, ఇతరులకు విక్రయిస్తే కార్డులను రద్దు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట సివిల్‌సప్లయ్ డీఎం నాగేశ్వరరావు, డీటీలు జావీద్, జ్యోతి, లింగస్వామి, ఆర్ఐ సురేందర్‌సింగ్ పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కోటం రాజు

నల్లగొండరూరల్, జూలై 11: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాల పెండింగ్ క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ వెల్ఫేర్ బోర్డు నిధులను ఇప్పుడున్న చట్టం ప్రకారం కార్మికులకు అమలుచేస్తున్న క్లెయిమ్స్ రాష్ట్రవ్యాప్తంగా 33,83 పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు నుంచి దారి మళ్లించిన నిధులను వెంటనే బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కంచి కేశవులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు అద్దంకి నరసింహ, ఎస్ సైదాచారి, పోలే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి'

నల్లగొండ కల్చరల్, జూలై 11: డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని, డ్రగ్స్ నుంచి యువతను, దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్‌వో) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో గురువారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఉన్న మేధావులు శాంతి ఉద్యమకారులు, యుద్ధోన్మాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలునిచ్చారు. అందులో భాగంగా ఆగస్టు 16 నుంచి 18వ తేదీ వరకు ఢిల్లీలో ఏఐపీఎస్‌వో జాతీయ సమితి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా యాదయ్య, కట్టా వెంకట్‌రెడ్డి, శంకరయ్య, గుర్రం వెంకట్‌రెడ్డి, నాగసేనరెడ్డి, ప్రద్యుమ్నరెడ్డి, బుక్క ఈశ్వరయ్య, శౌరయ్య, ఎల్‌వీయాదవ్, వెంకన్న, సత్యనారాయణ, శ్రీనివాస్, బ్రహ్మాచారి, వెంకట్రావ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

చండూరురూరల్, జూలై 11: కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. చండూరు మండల పరిధిలోని కొండాపురం, నెర్మట గ్రామాల్లో రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కౌలు రైతుల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో కౌలు రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కౌలు రైతులకు పంట రుణాలు, రైతుబంధు, రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేయాలని అన్నారు. కౌలు రైతులు ఎకరానికి 5 నుంచి 10వేల వరకు కౌలు చెల్లిస్తున్నారని, కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి పంట రుణాలు అందక ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జె.ధనుంజయగౌడ్, ఉప్పునూతల చంద్రయ్య, వెంకన్న, మల్లయ్య, యాదయ్య, వీరమల్ల అంజయ్య, యాదయ్య, సత్తయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

నల్లగొండ టౌన్, జూలై 11: తెలంగాణ ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పానగల్ చౌరస్తాలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో తెలంగాణ ఇంజనీర్ల ది నోత్సవాన్ని ఘనంగా ని ర్వహించారు. ఈ సం ద ర్భంగా నవాబ్ అలీ జం గ్ బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ డి. వెంకటేశ్వర్లు, టీజీవో జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, అధికారులు మధు, నరసింహ, సంపత్, రామకృష్ణ, రవి, సంతోష్‌రెడ్డి, రమేష్, గోకుల్ సాయి, కృష్ణమూర్తి పాల్గొన్నారు

● పంచాయతీరాజ్ ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ తిరుపతయ్య, ఈఈలు దీపక్, భూమన్న, డిప్యూటీ ఈఈలు రఘపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, మూర్తి, యూసూఫ్, ఖజా, రవళి పాల్గొన్నారు.

దేశ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలి

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ జేడీ లక్ష్మీనారాయణ

హాలియా, జూలై 11: విద్యార్థులు సినిమా హీరోలను కాదు.. దేశ నాయకులను ఆదర్శంగా తీసుకుని వారి భవిష్యత్తును ఉత్తమంగా తీర్చుదిద్దుకోవాలని, అప్పుడే తల్లిదండ్రులకు, సమాజానికి సార్థకత ఏర్పడుతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా అనుముల మండలం పంగవానికుంటతండాలో జేడీ ఫౌండేషన్, ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీ ఇంటి కోసం, మీ ఊరి కోసం, మీ రాష్ట్రం కోసం, మన దేశం కోసం పని చేసే బాధ్యత కలిగిన పౌరులుగా మార్చాలనే ఉద్దేశంతో పంగవానికుంట తండాలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశ నాయకుల జీవిత చరిత్రలు చదివితే కొత్త విషయాలు తెలుస్తాయని, క్రమశిక్షణ, ఏకాగ్రతతో ఎలాంటి విజయాలైనా సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో మర్రి లక్ష్మణ్‌రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి ప్రవీణ్‌సింగ్, ఎంఈవో బాలునాయక్, జేడీ ఫౌండేషన్ కన్వీనర్ కవిత, తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ వేత్త సురేష్ గుప్తా, ఫ్రెండ్స్ యూత్ సొసైటీ ఫౌండర్ మెగావత్ కొండానాయక్, అధ్యక్షుడు భరత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, అంజి, సాయి, రమేష్, సురేష్, శ్రీను, కార్తీక్, నవీన్, కుమార్, శ్రీకాంత్, శివ, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● గ్రంథాలయ ప్రారంభోత్సవానికి హాజరైన 500 మంది విద్యార్థులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేడీ లక్ష్మీనారాయణ విద్యార్థుల కోసం పలు కార్యక్రమాలు చేపడుతున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వగాల భాస్కర్‌రెడ్డి, తేరా అఖిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలుచేయాలి

● బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి


సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 11: రాష్ట్రంలోని రైతాంగానికి వెంటనే ఎన్నికల హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ అమలుచేయాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. రైతులు సాగు చేసే ప్రతీ ఎకరానికి సంవత్సరానికి రూ.15వేలు రైతుభరోసా కింద ఆర్థికసాయం అందజేయాలన్నారు. రైతు కూలీలకు రూ.12వేలు అందించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి అంజయ్య, బీజేపీ రాష్ట్ర నాయకులు బండారు ప్రసాద్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పాలకూరి యేలేందర్‌గౌడ్, చలమల్ల సీతారాంరెడ్డి, గుండా నవీన్‌రెడ్డి, భవనం మధుసూదన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుడితండాలో గృహాల రీ సర్వే

దేవరకొండ, జూలై 11: కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుడితండాలో గృహాలను మొత్తం రీసర్వే చేయనున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం తండాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండ్లిపాకల రిజర్వాయర్ ఏర్పాటులో గుడితండా ముంపు గ్రామంగా ఉందన్నారు. గతంలో ఆర్అండ్‌బీ అధికారులు ప్రజల నివాస గృహాలకు ఎస్టిమేషన్ వేశారు. అయితే కొన్ని గృహాలకు అధికంగా, మరికొన్ని గృహాలకు తక్కువ ఎస్టిమేషన్ వేశారని గ్రామస్థులు ఆరోపించారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యం గ్రామస్థులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామస్థుల వినతులను సాదరంగా విన్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గ్రామస్థుల కోరిక మేరకు గ్రామంలోని గృహాలను మొత్తం రీ సర్వే చేయించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ డీఈ భాస్కర్, ఇరిగేషన్ డీఈ రమేష్‌తో పాటు మాజీ సర్పంచ్ అంజిలి రాంబాబు, గ్రామస్థులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలి : సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

చండూరు, జూలై 11: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. పట్టణంలోని మాదగోని నర్సింహ భవన్‌లో నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ మండల కార్యవర్గ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేయాలని, నియోజకవర్గంలో అత్యధిక స్థానాల్లో పోటీ చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమచేయాలని, రుణమాఫీ ఒకే సారి చేయాలని అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించి పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని కోరారు. మండలంలో చిన్న నీటి వనరులైన బెండలమ్మ చెరువు, శేషిలేటి, వెల్మకన్నె ఫీడర్ ఛానళ్లను పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు అందివ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పారిశ్రామిక వర్గాలకు కొమ్ముకాస్తూ, రైతాంగ, కార్మిక రంగాలను దెబ్బతీసే విధంగా పనిచేస్తుందని ఆరోపించారు. ఎన్నికల హామీలను అమలుచేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. జిల్లా కార్యవర్గసభ్యుడు బొల్గూరి నర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అంజాచారి, రామలింగయ్య, రామచంద్రం, మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, నాయకులు వెంకన్న, యాదయ్య, రమేష్, చలపతి, రాములు, లింగయ్య పాల్గొన్నారు.

మూసీని ఆధునికీకరించి పర్యాటక కేంద్రంగా చేయాలి

కేతేపల్లి, జూలై 11: మూసీ ప్రాజెక్టును ఆధునికీకరించి పర్యాటక కేంద్రంగా మార్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీలో పూడికను తొలగించాలని కోరారు. పూడికతో ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయి ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వహణ సక్రమంగా లేక డిస్ట్రిబ్యూటరీల నుంచి నీరు వృథాగా వెళ్తుందని అన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.మారయ్య, నాయకులు ఎల్.రాజు, అశోక్‌రెడ్డి, లింగయ్య, సత్త య్య, సైదయ్య, బాలయ్య, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ప్రతీనెల అందేలా చర్యలు

● పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే హామీ


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పారిశుధ్య కార్మికులు

చండూరు, జూలై 11: వేతనాలు ప్రతీ నెలా అందేలా చూస్తానని మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం పట్టణానికి వచ్చిన ఆయన కార్మికులను కలిసి వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. మునిసిపాలిటీలో తమకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని ఈ నెల 1 నుంచి 9వ తేదీవరకు మునిసిపల్ కార్యాలయం ఎదుట సమ్మెకు చేపట్టారు. సమ్మె విరమించండి.. సమస్యలు పరిష్కరిస్తానని మునిసిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్‌యాదవ్‌తో కబురు పంపగా విరమించారు. వేతనాల చెల్లింపు విషయంలో మునిసిపల్ కమిషనర్‌తో చర్చించి వనరులు సమకూర్చుకోవాలని సూచించారు. ఆర్థిక వనరులపై దృష్టి సారించి ఇంటి, వాణిజ్య పన్నులు సకాలంలో వసూలు చేసేలా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. మీ సమస్యల గురించి ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. దీంతో ఎమ్మెల్యేను వారు శాలువాతో ఘనంగా సన్మానించారు. మీ సమస్యల గురించి ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ దోటి సుజాత వెంకటేష్‌యాదవ్, కమిషనర్ వెంకటమణికరణ్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు ఓంకారం, అనంత చంద్రశేఖర్, డాక్టర్ కోడి శ్రీనివాసులు, నల్లగంటి మల్లేష్, పన్నాల లింగ య్య, కోడి గిరిబాబు, పల్లె వెంకన్న, మంచుకొండ సంజయ్, ఐతరాజు మల్లేష్, జనార్ధన్ వేణు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి

మునుగోడు: వనమహోత్సవంలో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక హైస్కూల్ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. హైస్కూల్‌లో మూత్రశాల సమస్యను విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. మూత్రశాలల సమస్యను ఐదు రోజుల్లోనే పరిష్కారం చేయిస్తానని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని బొడ్రాయికి పూజలు


బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

కట్టంగూరు, జూలై 11: వర్షాలు సమృద్ధిగా పడాలని కోరుతూ మండలంలోని కలిమెర గ్రామపంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు గ్రామంలోని బొడ్రాయికి బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం చుట్టు కాముడు ఆడుతూ వర్షాలు సమృద్ధిగా పడి పంటలు పండాలని దేవుళ్లను ప్రార్థించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దేవరకొండ, జూలై 11: వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాలను శుభ్రం చేసుకోవాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సీజనల్ వ్యాధుల నియంత్రణ, నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఇళ్లలో నిల్వ ఉండే నీటి కుళాయిలు, టైర్లు, పూల కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రపరుచుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. సమస్య ఉంటే అధికారులకు తెలియజేయాలని అన్నారు. సమావేశంలో మునిసిపల్ మేనేజర్ ప్రశాంతి, వైద్యాధికారి కీర్తి, అధికారులు, ఆశాలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నల్లగొండ టౌన్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్(టాప్రా) సౌజన్యంతో హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో గల మ్యాక్స్ విజన్ మహాలక్ష్మి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం యూటీఎఫ్ భవన్‌లో రిటైర్డు ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు టాప్రా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ తెలిపారు.

నల్లగొండరూరల్: మండలంలోని మేళ్లదుప్పలపల్లి గ్రామానికి చెందిన నందిపాటి అంజయ్య పూరిగుడిసె షార్ట్‌సర్క్యూట్ కారణంగా గుడిసెతో పాటు సామగ్రి కాలిపోయింది. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్ అంజయ్య పరామర్శించి తన వంతుగా రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి తనవంతు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

నిడమనూరు: నిడమనూరు మండలకేంద్రంలోని నల్లచౌట చెరువును ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు రుద్రాక్షి నర్సింహ మంత్రి వెంకట్‌రెడ్డికి హైదరాబాద్‌లో వినతిపత్రం సమర్పించారు.

పెద్దఅడిశర్లపల్లి: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పోతేం కరుణాకర్‌కు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

దేవరకొండ: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని దేవరకొండ లయన్స్ క్లబ్ సహస్ర ఆధ్వర్యంలో గోరింటాకు పండగ వేడుకలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ సహస్ర అధ్యక్షురాలు శివపార్వతి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అలివేలుమంగ, మధుబాల, శ్రీదేవి, శైలజ పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): ప్రజావాణిలో ప్రజల విజ్ఞప్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. వివిధ శాఖల గ్రామస్థాయి సిబ్బందికి ప్రజావాణిపై పలు సూచనలు చేశారు. అదేవిధంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పథకానికి సంబంధించి గ్రామాల్లోని పాఠశాలలను ఆయన ఎంపీడీవో రమేష్, ఎంఈవో తరి రాము, ఎంఎస్‌వో శ్రీనివాస్‌తో కలిసి పర్యవేక్షించారు.

శాలిగౌరారం: మండలంలోని బైరవునిబండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీసెల్ సీనియర్ నాయకుడు నరిగె నర్సింహ మంత్రి వెంకట్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో కప్పి సన్మానించారు.

మర్రిగూడ: మండలంలోని దామెర బీమనపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన నరేందర్ తమ భూమిని అక్రమంగా కబ్జా చేసుకొని తమకు అన్యాయం చేశారంటూ భూ సమస్యపై ఓ దివ్యాంగుడు హైదరాబాద్‌లోని గాం ధీభవన్‌కు వచ్చి కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ వధయాష్కిగౌడ్ ముందు మొరపెట్టుకున్నారు. స్పందించిన మధుయాష్కి ధరణి వల్ల పలు సమస్యలు ఎన్నో ఉన్నాయని, మీ సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మధుయాష్కిగౌడ్ బాధితుడికి హామీ ఇచ్చారు.

చింతపల్లి: అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆట పాటలతో పాటు బొమ్మలతో విద్యాబోధన చెప్పాలని సూపర్‌వైజర్లు సుగుణ జ్ఞానేశ్వరి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో-4తో పాటు చౌళ్లతండాలోని అంగన్వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం నిర్వహించారు.

చింతపల్లి: కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అన్నీ రంగాల్లో ప్రగతి సాధిస్తోందని పార్టీ మండల నాయకులు అండేకార్ వెంకటేష్ అన్నారు. హైదరాబాద్‌లో రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. ఆయన వెంట అండేకార్ అశోక్, చాంద్‌పాష, చీకొండ పెద్దిరాజ్, శేఖర్, పాల్గొన్నారు.

చింతపల్లి: చింతపల్లి మండలంలోని హరిజనాపురం గ్రామంలో ప్రతీ నెలా పింఛన్ ఇవ్వాలని కోరుతూ గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి పద్మకు వినతిపత్రం అందజేశారు. నెలసరి ఇచ్చే పింఛన్ కోసం ఘడియాగౌరారం వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజావాణిలో కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.

చిట్యాలరూరల్: మండలంలోని గుండ్రాంపల్లిలో నివాసాల పైనుంచి వెళ్లిన విద్యుత్‌తీగలను తొలగించాలని సీపీఎం నాయకులు ప్రజావాణిలో ప్రత్యేక అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు.

నల్లగొండ టౌన్: ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులకు పట్టణంలోని న్యూస్ పాఠశాల ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి జెర్సీలను పంపిణీ చేశారు.

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ఫైలాన్ కాలనీలో 7వ వార్డులో ఉన్న శ్రీ వేమూరి అభిరామేశ్వర్‌రావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కౌన్సిలర్ నిమ్మల ఇందిర సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట గదిని, క్రీడా మైదానాన్ని, తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దేవరకొండ: కొండమల్లేపల్లి మండల పరిధిలోని 26 గ్రామపంచాయతీల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 58 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు.

నకిరేకల్: సిద్ధిపేట పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదిపై జరిగిన పోలీసుల దాడికి నిరసనగా తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ పిలుపు మేరకు నకిరేకల్‌లోని మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించారు.

డబుల్ ఇళ్లకు సదుపాయాలు కల్పించాలి

దేవరకొండ, జూలై 11: డబుల్ బెడ్రూం ఇళ్లకు మిషన్‌భగీరథ ద్వారా తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. గురువారం లబ్ధిదారులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ పెంచికల్‌పహాడ్ వద్ద 525 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. కానీ నీటి, విద్యుత్ సౌకర్యం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో మునిసిపాలిటీ ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు అలివేలు, సుల్తానా, అమీర్‌బీ, గౌస్య తదితరులు పాల్గొన్నారు.